www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 19 ఏప్రిల్ 2025
5
చిత్తూరు



జిల్లా వ్యాప్తంగా విస్తృత తనిఖీలు

75 కేసులు నమోదు



వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్పి మణికంఠ చందోలు

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: విజిబుల్ పోలీసింగ్ పేరిట చిత్తూరు జిల్లా పోలీసులు శుక్రవారం రాత్రి తొమ్మిది గంటల నుండి 11 గంటల వరకు జిల్లా వ్యాప్తంగా వాహన తనిఖీలు నిర్వహించారు. రెండు గంటల వ్యవధిలో 4,275 వాహనాలను తనిఖీ చేసి సరైన పత్రాలు లేవంటూ 75 కేసులు నమోదు చేశారు. సరైన పత్రాలు లేని 75 మంది వాహనదారులకు రూ.43,760 జరిమానా విధించారు. జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన పోలీసు తనిఖీలను చిత్తూరు ఎస్పీ మణికంఠ చందోలు పర్యవేక్షణతో పాటు మొరకంబట్టులో స్వయంగా వాహన తనిఖీల్లో పాల్గొన్నారు.

జిల్లా వ్యాప్తంగా సరైన పత్రాలు లేని 4 ద్విచక్రవాహనాలు, 2 కార్లు, ఒక లారీ, ఒక పశువుల వాహనం మొత్తం 8 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. 27 మందిపై డ్రంక్ అండ్ డ్రైవ్, ముగ్గురిపై ఓపెన్ డ్రింకింగ్, ఓ మైనర్ డ్రైవింగ్ మొత్తం 31 మందిపై కేసులు నమోదు చేశారు. బంగారుపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో సుమారు 5 లక్షల విలువ కలిగిన ఒక కారు, 20 (750 మిల్లీ లీటర్ల) మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు. వి కోట పోలీస్ స్టేషన్ పరిధిలో సుమారు 3,450 రూపాయలు విలువైన 8.6 లీటర్ల 96 టెట్రా ప్యాకెట్స్ స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు.

అనుమానాస్పద వ్యక్తుల గుర్తింపు కోసమే

జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో అకస్మాత్తుగా నిర్వహించిన వాహన తనిఖీల నేపథ్యంలో ప్రజల భద్రత, శాంతి భద్రతల పరి రక్షణలో భాగంగా అనుమానాస్పద వాహనాలు, వ్యక్తులు జిల్లాలోకి ప్రవేశించ కుండా అడ్డుకునేందుకు ఈ తనిఖీలు చేపట్టినట్లు తెలిపారు. నేరాల నియంత్రణ, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డు వేయడం, సరైన పత్రాలు లేని వాహనాలను గుర్తించి తగిన చర్యలు తీసుకోవడం ముఖ్య ఉద్దేశం అని పోలీసులు తెలిపారు. ద్విచక్ర వాహన దారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కారులో ప్రయాణించే వారు సీట్‌బెల్ట్ ధరించాలి. వాహన చట్టాలకు అను గుణంగా అన్ని పత్రాలు కలిగి ఉండాలని, లేకుం టే చట్టపర చర్యలు తీసుకుంటామని హెచ్చ రించారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగడం, అక్రమ రవాణా, ఇతర నేరపూరిత చర్యలపై కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. ప్రజల సహకారంతోనే పోలీస్ శాఖ మరింత సమర్థవంతంగా పనిచేస్తుందని, అందులో భాగంగా ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలు, చట్టాలను గౌరవించాలని సూచించారు. జిల్లాలో శాంతి, భద్రతను కొనసాగించేందుకు పోలీసుల కృషికి ప్రజలు తోడ్పాటును అందించాలని ఎస్పి మణికంఠ చందోలు కోరారు.

వక్ఫ్ సవరణ చట్టం ఉపసంహరించాలి

ప్రత్యేక సంచికకు విశేష ఆదరణ

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: వక్ఫ్ సవరణ చట్టాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని సిపిఎం జిల్లా కన్వీనర్ వాడ గంగరాజు కోరారు. వక్ఫ్ బిల్లును పార్లమెంట్ ఆమోదించడాన్ని సిపిఎం వ్యతిరేకిస్తుందని ఆయన అన్నారు. వక్ఫ్ చట్టంపై సమగ్ర సమాచారంతో 'ప్రజాశక్తి' స్పెషల్ తీసుకురావడం అభినందనీయమని శుక్రవారం చిత్తూరులో దర్గా సర్కిల్ వద్ద ముస్లిం పెద్దలు అభినందించారు. సిపిఎం జిల్లా కన్వీనర్ వాడ గంగరాజు ఆధ్వర్యంలో ముస్లిం పెద్దలు ప్రత్యేక సంచికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేరళ రాష్ట్ర ప్రభుత్వం, సిపిఎం మొదటి నుంచి మైనార్టీలకు అండగా నిలబడుతోందన్నారు. మత సామరస్యాన్ని కాపాడడంలో 'ప్రజాశక్తి' ముందుంటోందని తాము గమనిస్తున్నామన్నారు. మైనారిటీలపై జరిగే దాడులను ప్రతి సందర్భంలోనూ చిత్తూరులో ఐక్య పోరాటాల్లో సిపిఎం నిరంతరం కలిసి వస్తోందన్నారు. ఈ సందర్భంగా వాడ గంగరాజు మాట్లాడుతూ లౌకిక దేశంలో కులాలకు, మతాలకు అతీతంగా దేశ సమైక్యత కోసం అందరూ కలిసి ఐక్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. మతోన్మాద బీజేపీ ప్రభుత్వం ఆలంబిస్తున్న మత చిచ్చులను ప్రతి ఒక్కరూ ప్రతి ఘటించాలని పిలుపు నిచ్చారు. సుప్రీంకోర్టు స్పష్టంగా చెప్తున్నప్పటికీ ప్రభుత్వం ఏమాత్రం దిగిరాకపోవడం దారుణమన్నారు. ఇదేదో ముస్లింలకు సంబంధించింది అనుకుని ఇతరులనుకుంటే పొరపాటు అని అన్ని మతాల పై దాడి చేస్తోందని మతోన్మాద బిజెపి ప్రభుత్వంపై అందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. వారి విధానాలను ఎండగట్టడంలో ఐక్యంగా కలిసి ముందుకు రావాలని పిలుపునిచ్చారు.


వక్ఫ్ ప్రత్యేక సంచికను ఆవిష్కరిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు

సోమలలో ఈదురు గాలుల వర్షం


మామిడి, టమోటా పంటకు తీవ్ర నష్టం

ప్రజాశక్తి -సోమల: సోమల మండలంలో శుక్రవారం సాయంత్రం కురిసిన ఈదురుగాలులతో కూడిన వర్షం మామిడి, టమోటా పంటలకు తీవ్ర నష్టం కలిగించింది. మండలంలో అనేక ప్రాంతాలలో శుక్రవారం సాయంత్రం 4.30 గంటల నుండి సాయంత్రం 6. 30 వరకు భారీ ఈదురు గాలులతో కూడిన ఓ మోస్తరు వర్షం కురిసింది. మొదట భారీ ఈదురు గాలులు ప్రారంభమై పెద్ద పెద్ద చినుకులతో దాదాపు 40 నిమిషాల పాటు వర్షం కురిసింది. సాయంత్రం 6 గంటల 27 నిమిషాలకు భారీ శబ్దంతో పిడుగు పడింది. అయితే ఎక్కడ పిడుగు పడిందో తెలియ రాలేదు. ఈదురు గాలుల వల్ల మామిడి చెట్లలోని పిందెలు, కాయలు రాలిపోయాయి. టమో టా రైతులకు కూడా వర్షం వల్ల భారీ నష్టం కలిగిందని రైతులు అంటున్నారు. ప్రభుత్వాధికారులు నష్టం అంచనా వేసి పరిహారం చెల్లించాలని బాధిత రైతులు కోరుతున్నారు.


సోమలలో కురిసిన ఈదురు గాలులతో కూడిన వర్షం

వడగళ్ల వర్షం

ప్రజాశక్తి -రామకుప్పం: రామకుప్పం మండల పరిధిలోని చల్దిగానిపల్లి పరిసరాల్లో శుక్రవారం సాయంత్రం ఆకస్మికంగా వడగళ్ల వర్షం కురిసింది. రెండు రోజులుగా ఎండ వేడిమి తీవ్రంగా ఉండగా ఉక్కపోతతో తల్లడిల్లిన జనం వర్షం రాకతో ఊపిరి పీల్చుకున్నారు. వాతావరణం చల్లబడింది. రామకుప్పంతో పాటు పలు గ్రామాల్లో వర్షం కురిసింది. కాగా ఈదురుగాలులతో కూడిన వడగళ్ల వర్షం వల్ల ఉద్యానవన పంటలతో పాటు మామిడి తోటలకు నష్టం వాటిల్లిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు పంట నష్టం అంచనా వేయాల్సి వుంది.


రామకుప్పంలో కురిసిన వడగళ్ల వర్షం

వడదెబ్బకు మహిళ మృతి

ప్రజాశక్తి -విజయపురం: మండలానికి చెందిన వళ్లెమ్మ(57) శుక్రవారం వడదెబ్బకు గురై మృతి చెందింది. మండలంలోని పన్నూరు దళితవాడకు చెందిన వళ్లెమ్మ వ్యవసాయ పొలం పనిలో నిమగ్నమైంది. హఠాత్తుగా స్పృహతప్పి పడిపోయింది. హుటాహుటిన పన్నూరు సబ్‌స్టేషన్‌లోని ఓ ప్రయివేటు వైద్యశాలకు తరలించారు. అయితే వైద్య పరీక్షలు నిర్వహించిన వైద్యులు ఆమె అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు.


వడదెబ్బకు గురై మృతి చెందిన వళ్లెమ్మ

చెరువులో పడి అవ్వ మనవడు మృతి

బిజిగానిపల్లిలో విషాద ఛాయలు


చెరువులో పడి మృతి చెందిన అవ్వ మనవడు

ప్రజాశక్తి-గుడిపల్లి: ప్రమాదవశాత్తు చెరువులో పడి అవ్వ మనవడు మృతి చెందిన సంఘటన మండలంలో శుక్రవారం చోటు చేసుకుంది. దీంతో బిజిగానిపల్లిలో విషాద ఛాయలు అలుముకున్నాయి. గుడిపల్లి మండలం గుడిపల్లి గ్రామపంచాయతీ బిజిగానిపల్లి గ్రామానికి చెందిన మకరందప్ప భార్య మునెమ్మ (68), ఆమె మనవడు తొమ్మిదవ తరగతి చదువుతున్న జయ ప్రదీప్ (14) శుక్రవారం మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో వారి గొర్రెలు, ఆవులను నాగులప్ప చెరువులో కడిగేందుకు తీసు కెళ్లారు. చెరువులో దిగి పశువులను శుభ్రం చేస్తున్న మునెమ్మ ప్రమాదవశాత్తు బురదలో చిక్కుకుంది. ఇది గమనిస్తున్న మనవడు జయ ప్రదీప్ అవ్వను కాపాడడానికి చెరువులో దిగాడు. ఇద్దరూ బురదలో చిక్కుకుని మృతి చెందారు. ఇద్దరికీ ఈత రాకపోవడంతో నీటిలో మునిగి మృతి చెందినట్లు స్థానికులు పేర్కొన్నారు. పోలీసులకు సమాచారం అందడంతో సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాలను బయటకు తీశారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

అనారోగ్యంతో విఆర్ఎ మృతి

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: వీఆర్ఏ సుధాకర్ అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మండలంలోని తుంబకుప్పం వీఆర్ఏగా విధులు నిర్వహిస్తూ అనారోగ్య సమస్యలతో గత కొంతకాలం చికిత్స పొందుతూ గురువారం అనారోగ్యం అధికం కావడంతో ఆసుపత్రికి తరలించారు. ఆరోగ్యం క్షీణించి శుక్రవారం మృతి చెంది నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. విఆర్ఎ మృత దేహాన్ని తహశీల్దారు బాబు రాజేంద్రప్రసాద్, రెవెన్యూ సిబ్బంది సందర్శించి నివాళులర్పించారు.


సుధాకర్, విఆర్ఎ (ఫైల్ ఫొటో)

భక్తి శ్రద్ధలతో గుడ్ ఫ్రైడే

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: గుడ్ ఫ్రైడే సందర్భంగా క్రైస్తవ సోదరులు చిత్తూరు నగరంలోని పలు చర్చిల్లో ఉపవాసంతో భక్తిశ్రద్ధలతో ఉదయం నుండి మధ్యాహ్నం మూడు గంటల వరకు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. చిత్తూరు నగరంలోని సిఎస్ఐ టౌన్ చర్చ్ రెవరెండ్ డాల్విన్ క్రిస్ట్ దాస్ మాట్లాడుతూ గుడ్ ఫ్రైడే పురస్కరించుకొని 40 రోజులుగా ఉపవాసంతో క్రైస్తవులు ప్రార్థనలు, దానాలు చేస్తుంటారన్నారు. దీని ద్వారా ఆశీర్వాదకరంగా ఉంటారని తెలిపారు. గుడ్ ఫ్రైడే రోజు ఏసుక్రీస్తు సిలువపై చెప్పిన ఏడు మాటలను ధ్యానించి ఆ మాటల ద్వారా ప్రపంచానికి సమాధానం శాంతిని కలిగి స్తుందని తెలిపారు. గుడ్ ఫ్రైడే అనంతరం పరిశుద్ధాత్మ యేసుక్రీస్తు మూడవరోజు తిరిగి లేచిన దినాన్ని ఈస్టర్ పండుగగా జరుపుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఎస్ఐ టౌన్ చర్చ్ రెవరెండ్ డాల్విన్ క్రిస్ట్ దాస్, క్రైస్తవ సోదరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


బంగారుపాళ్యంలో

బంగారుపాళ్యం: గుడ్ ఫ్రైడేను క్రైస్తవులు మండలంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. సర్వ మానవాళి రక్షణకు ప్రార్థనలు చేశారు. ఉపవాసం అనంతరం అన్నదానం కార్యక్రమాలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో క్రైస్తవులు పాల్గొన్నారు.

పండ్ల తోటల పెంపకానికి దరఖాస్తు చేసుకోవాలి

డ్వామా పీడీ రవికుమార్



ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: ఉపాధి హామీ ద్వారా పండ్ల తోటల పెంపకానికి రైతులు దరఖాస్తు చేసుకోవచ్చని చిత్తూరు జిల్లా డ్వామా పీడీ రవికుమార్ శుక్రవారం పేర్కొన్నారు. 2025–2026 ఆర్థిక సంవత్సరంలో చిత్తూరు జిల్లాలో కలెక్టర్ ఆదేశాను సారం ఉపాధి హామీ, ఉద్యాన శాఖ లు సంయుక్తంగా జిల్లాలో ఐదువేల ఎకరాలలో పండ్ల తోటల పెంపకం చేపడుతుందన్నారు. మామిడి , జామ, కొబ్బరి, దానిమ్మ, అల్ల నేరేడు, చింతకాయ, సీతాఫలం, డ్రాగన్ ఫ్రూట్, మొదలైన రకాల పండ్ల తోటల పెంపకం చేపట్టవచ్చన్నారు. పూల సాగు మల్లె, రోజా సాగుకు ఆసక్తి వున్న రైతులు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఉపాధి హామీ జాబ్ కార్డు కలిగిన ప్రతి ఒక్క చిన్న సన్నకారు రైతులు ప్రతి ఒక్కరూ పండ్ల తోట పెంపకానికి దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. మండల పరిధి లోని ఉపాధి హామీ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. దరఖాస్తు ఫారాలు కార్యాలయంలో అందుబాటులో వున్నాయని తెలిపారు. అర్హులైన ప్రతి రైతు ఈ నెల చివరిలోపు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

సమన్వయంతో విజయవంతం చేయాలి

నేడు 'స్వర్ణాంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర' నిర్వహణపై కలెక్టర్ ఆదేశం


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ సుమిత్‌కుమార్

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నెలా మూడో శనివారం స్వర్ణాంధ్ర– స్వచ్ఛ ఆంధ్ర'ను ప్రకటించిందని, ఈ కార్యక్రమాన్ని శనివారం అందరూ సమన్వయంతో విజయవంతంగా నిర్వహించాలని కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. ఈ మేరకు 'స్వర్ణాంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర ' నిర్వహణపై టెలి కాన్ఫరెన్స్ ద్వారా అన్ని శాఖల జిల్లా అధికారులు, ఆర్డీవోలు మున్సిపల్ కమిషనర్లు, తహశీల్దార్లు, ఎంపీడీఓలకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్వర్ణాంధ్ర –స్వచ్ఛ ఆంధ్రలో భాగంగా ప్రతి మాసం ఒక ప్రత్యేక కార్యక్రమాల నిర్వహణ చేపడుతున్నామన్నారు. ఏప్రిల్ లో మూడవ శనివారం 19 తేదీ ఇ –చెక్ అనే ప్రధాన అంశంగా కార్యక్రమాలు నిర్వహించా లన్నారు. ఇ–చెక్ అంటే అని మున్సిపాలిటీలు, గ్రామీణ ప్రాంతాలలోని ఇళ్లు, దుకాణాలలో ఉన్న ఎలక్ట్రానిక్ వ్యర్థాలను పూర్తిగా సేకరించి రీ యూస్ చేయడం అన్నారు. ఇందుకు షాపులు, ఇళ్లల్లో ఉన్న ఎలక్ట్రానిక్ వేస్ట్‌లను పూర్తిగా సేకరించాలన్నారు. ఈ వేస్ట్‌ని సేకరిం చేందు కు స్వయం సహాయక సంఘాల మహిళలకు బాధ్యత లు అప్పగించా మన్నారు. రోజు వారీ జీవితంలో స్వచ్ఛత ఓ భాగం కావాలనన్నారు. ఇ చెక్ అనే అంశా నికి సంబంధించిన పెద్దఎత్తున అవగాహన కార్యక్రమా లు ప్రతి గ్రామ, వార్డు సచివాలయ పరిధిలో ప్రజా ప్రతినిధులు, ప్రజల భాగస్వామ్యంతో స్వచ్ఛ దివస్ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ప్రతి శాఖలో 'స్వర్ణఆంధ్ర –స్వచ్ఛ ఆంధ్ర' కార్యక్రమాలు నిర్వహిం చాలని ఇందుకు సంబంధించిన వివరాలను యాప్‌లో తప్పనిసరిగా అప్‌లోడ్ చేయాలని ఆదేశించా రు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు, ఆర్డీవోలు మున్సిపల్ కమిషనర్లు, తహశీల్దార్లు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల ఉద్యోగోన్నతులు, సీనియార్టీ జాబితా పారదర్శకం

- అభ్యంతరాలు ఉంటే మూడు రోజుల్లో తెలపాలి
- కడప ఆర్‌జెడి శామ్యూల్

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: చిత్తూరు జిల్లాలోని ఉపాధ్యాయుల ఉద్యోగోన్నతులకు సంబంధించిన సీనియార్టీ జాబితాను పారదర్శకంగా తయారు చేశామని విద్యాశాఖ కడప ఆర్జెడి శామ్యూల్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ పాఠశాల విద్య మార్గదర్శకాల ప్రకారం సీనియార్టీ జాబితాను విద్యాశాఖ సిబ్బంది సిద్ధం చేశారన్నారు. ఈ మేరకు శుక్రవారం డీఈఓ కార్యా లయానికి వచ్చిన ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉపాధ్యాయుల ఉద్యోగోన్నతులు ప్రభుత్వ ఆదేశాల మేరకు పారదర్శకంగా నిర్వహిస్తామని తెలిపారు. సీనియార్టీ జాబితాను గురువారం రాత్రి లోపు విడుదల చేస్తామన్నారు. విద్యా శాఖ వెబ్ సైట్ లో జాబితాను తెలియ పరుస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ టీచర్ల ఉద్యోగోన్నతులు, సీనియార్టీ జాబితాలో ఏమైనా అభ్యంతరాలు ఉంటే మూడు రోజుల లోపు తెలపాలన్నారు. ఆదివారం సాయంత్రం లోపు ఈ జాబితాలో ఎలాంటి అభ్యంతరాలు వున్నా సంబంధిత ఉపాధ్యాయులు ఫిర్యాదు చేయ వచ్చన్నారు. గురువారం రాత్రి నుంచి ఉపాధ్యాయుల ఉద్యోగోన్నతులు, సీనియార్టీ జాబితాను ఆన్‌లైనులో చూసుకోవచ్చునని తెలిపారు. ఎస్‌జిటి నుంచి స్కూలు అసిస్టెంట్ ఉపాధ్యాయులుగా, స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యా యుల నుంచి ప్రధానోపాధ్యాయులుగా ఉద్యోగోన్నతికి సంబంధించిన సీనియార్టీ జాబితా పూర్తి పారదర్శకంగా రూపొందించామన్నారు. ఉపాధ్యాయులు ఉద్యోగోన్నతుల ప్రక్రియకు సహకరించాలని కడప ఆర్జెడి శామ్యూల్ కోరారు.


మాట్లాడుతున్న కడప ఆర్‌జెడి శ్యాముల్

ఆక్రమణలు తొలగించండి

దుకాణదారులకు డిఎస్‌పి హెచ్చరిక


వ్యాపారులకు సూచనలు ఇస్తున్న నగరి డిఎస్‌పి

ప్రజాశక్తి- కార్వేటినగరం: కార్వేటినగరం పట్టంలో వ్యాపార సముదాయల ముందు ఆక్రమ ణలను తొలగించాలని నగరి డిఎస్పి సయ్యద్ మహ్మద్ అజీజ్ వ్యాపా రులను హెచ్చ రించారు. దుకాణ వ్యాపారులతో పోలీసు స్టేషన్ వద డిఎస్‌పి శుక్రవారం మాట్లాడుతూ దుకాణాల వద్ద సిసి కెమెరా తప్పని సరిగా ఏర్పాటు చేసుకోవాలని, కనీసం రెండు కెమెరా ఏర్పాటు చేయాలని అందులో ఒకటి రోడ్డు కనబడేలా ఏర్పాటు చేయలని, నో పార్కింగ్ బోర్డు ఏర్పాటు చేసి, ట్రాఫిక్‌కి ఎలాంటి అంతరాయం కలగకుండా చూడా లని, సూచించారు. ఆక్రమణలను ఓకే వారం రోజుల లోపు తొలగించకుంటే చట్టపర చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐ హనుమంతప్ప, ఎస్ఐ రాజకుమార్ పాల్గొన్నారు.

గంజాయి రహిత ఏర్పాటుకు..

ఈ స్కానర్ ఏర్పాటు


ఈ స్కానర్‌ను ఏర్పాటు చేస్తున్న సోమల పోలీసులు

ప్రజాశక్తి -సోమల: మండలంలో గంజాయి విక్రయం వాడకం, పొలాలలో పండించడం, తదితర విషయాల గురించి పోలీసులకు సమాచారం అందించేందుకు ఎస్పీ మణికంఠ చందోలు ఆదేశాల మేరకు పలు కూడళ్లలో పోలీసు లు శుక్రవారం ఈ స్కానర్ ఏర్పాటు చేశారు. మొబైల్ ద్వారా స్కానర్ స్కాన్ చేసి గంజాయి గురించిన సమాచారాన్ని పోలీసు లకు ఫోన్ ద్వారా అందించ వచ్చునని, సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని ఎస్ఐ శివశంకర్ తెలిపారు. పాఠశాలల చుట్టుపక్కల, బ్యాంకుల వద్ద కందూరు సోమల నంజంపేట పెద్ద ఉప్పరపల్లి తదితర గ్రామాలలో ప్రధాన కూడళ్ల వద్ద స్కానర్ గోడలకు అతికించామని గంజాయి గురించిన సమాచారాన్ని తెలిపి గంజాయి రహిత సమాజం కోసం ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

గిరిజనుడి భూమి కబ్జా

- పెత్తందారుల దౌర్జన్యం
- కేసు నమోదు చేయాలి
- పోలీసులకు యానాది సంఘం నాయకుల వినతి

ప్రజాశక్తి -బైరెడ్డిపల్లి: మండలంలోని దేవదొడ్డి పంచాయతీ పరిధి లోని కుటవలవంక గ్రామానికి చెందిన నాగరాజ్ భూమిని పెత్తందారులు కబ్జా చేశారని ప్రశ్నిస్తే దౌర్జన్యానికి పాల్పడుతున్నారని వారిపై చట్టపర చర్యలు తీసుకోవాలని ఎస్ఐకి ఏపీ రాష్ట్ర యానాది సంఘం అధ్యక్షులు సి కోటయ్య శుక్రవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ కుటవలవంక గ్రామానికి చెందిన నాగరాజు కుటుంబ సభ్యులు ఐదు సంవత్సరాల క్రితం ఖాతా నెంబర్ 1483 గల 2ఏ భూమిని ఆర్ శశిధర్ వద్ద కొనుగోలు చేశారన్నారు. అప్పటినుండి వారు సాగు చేసుకుంటూ జీవనం గడుపుతున్నారని, కానీ మూడు నెలల క్రితం తమ భూమి సర్వే చేయించారు. సర్వే సమయంలో పక్కనున్న పెత్తందారులు వారు కొంత భూమి ఆక్రమించుకున్నట్లు మండల సర్వేయర్ నిర్ధారించారు. కానీ ఆ సరిహద్దు కాదని పెత్తందారుడైన చంద్ర ముకుంద వాళ్ళు తమపై దౌర్జన్యంగా ప్రవర్తిస్తూ భూమిని ఆక్రమించారన్నారు. ఈ విషయమై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర యానాది సంఘ అధ్యక్షులు రాష్ట్ర కార్యదర్శి ఆర్ కృష్ణప్ప, సభ్యులు గోపి, జయప్ప, సహదేవ, నాగరాజు, రాంబాబు, ధర్మప్ప, వెంకటేశు, వెంకటరత్న, కలిసి నాగరాజు ఇచ్చిన ఫిర్యాదు మేర కు పొలం వద్దకు వెళ్లి పరిశీలించారు. అగ్రకులాల పట్టణ దారులు, రెవెన్యూ సిబ్బంది సర్వే చేయించి నాటి సర్వేలను తొలగిస్తూ రాష్ట్ర నాయకులపై వమర్శిస్తూ మాటాడినట్లు ఏపీ ఆంధ్రప్రదేశ్ యానాదుల సంఘం అధ్యక్షులు తెలిపారు. ఈ విషయమై స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశామని ఆయన తెలిపారు. దీనిపై స్థానిక పోలీసులను విచారణ కోరగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని తెలిపారు . మండల తహశీల్దారు మాధవరాజుని విచారణ కోరగా మంగళవారం మళ్లీ సర్వే నిర్వహించి సరిహద్దులు చూపుతామని వారు తెలిపారు. ఏపీ రాష్ట్ర యానాది సంఘం అధ్యక్షులు కోటయ్య మాట్లాడుతూ అగ్రకులాల పెత్తనదారులు నాగరాజు భూమి కబ్జా చేశారని పరిశీలించడానికి వెళ్తే పెత్తందారుడు చంద్రప్ప ముకుంద దౌర్జన్యంగా, దురుసుగా 'గిరిజనులదైతే మాకేంటి? నీకేం సంబంధం లేదు..'అంటూ వారిపై దౌర్జన్యం చేశారన్నారు. ఈ విషయమై స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశామని వారు ప్రతికా ప్రతినిధులకు తెలిపారు.



పోలీసులకు వినతిపత్రం అందించిన యానాది సంఘం నాయకులు



పిడుగుపాటుకు మృతిచెందిన లేగ దూడ

పిడుగు పాటుకు లేగ దూడ మృతి

ఆస్తి నష్టం

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: పిడుగుపాటుకు లేగ దూడ మృతి చెంద ఆస్తి నష్టం సంభ వించిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. మండలంలోని వెంగం వారి పల్లి పంచాయతీ పరిధిలోని కడతట్ల పల్లి గ్రామానికి చెందిన బండపల్లి రామ చంద్రప్ప పొలం వద్ద పాక వేసుకొని ఆవులు మేపుకుంటున్నాడు. గురువారం రాత్రి భయంకరమైన గాలివాన పడటంతో అతను పక్కన ఉన్న ఇంకొక పాకలో ఉన్నాడు. పెద్దగా ఉరుముల శబ్దం రావడంతో కొంతసేపు ఏమి జరిగిందో తెలియక భయాందోళనకు గురయ్యాడు. తరువాత అక్కడికి వెళ్లి చూశాడు. పిడుగు పాటుకు లేగ దూడ మృతి చెందింది. ఇతని నష్టాన్ని గుర్తించి, ప్రభుత్వం సాయం చేసి ఆదుకోవాలని పాడిరైతు అభ్యర్థించాడు.



కుళాయిలను పరిశీలిస్తున్న జలజీవన్ మిషన్ బృంద సభ్యులు

ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి -బైరెడ్డిపల్లి: బైరెడ్డిపల్లి గ్రామ పంచా యతీలో జలజీవన్ మిషన్, స్వచ్ఛ భారత్ మిషన్ కేంద్ర బృందం సభ్యులు శుక్రవారం తనిఖీలు నిర్వ హించారు. గత సంవ త్సరం పాత పంచాయతీ కార్యాలయం సమీపంలో జలజీవన్ మిషన్ నిధులతో నిర్మించిన ఓహెచ్ఎస్ఆర్ తాగు నీటి ట్యాంకును వారు పరిశీలించారు. ట్యాంక్ ద్వారా అందరికీ సక్రమంగా స్వచ్ఛమైన తాగునీరు అందుతుందా లేదా? తాగునీటి కుళాయిలు అందరికీ అందుబాటులో ఉన్నాయా.. లేదా? అని ట్యాంక్ సమీపంలోని అన్ని ఇళ్లకు వెళ్లి పరిశీలించారు. గ్రామంలోని పలు వీధులను పరిశీలించారు. అనంతరం స్థానిక సచివాలయంలో గ్రామ పంచాయతీ తాగునీరు, పారిశుధ్య కమిటీ, ప్రజలతో సమావేశం నిర్వ హించారు. ఈ సందర్భంగా తాగునీటి ట్యాంకు ద్వారా అందిస్తున్న నీటిని పిహెచ్ ఫ్లోరైడ్, క్లోరైడ్, క్లోరినేషన్ టెస్టులు అందరి సమక్షంలో కమిటీ సభ్యుల ద్వారా చేయించి అందుతున్న నీరు స్వచ్ఛమైందని తెలిపారు. గ్రామ పంచాయతీ రికార్డులు పరిశీలించారు. ఈ కార్యక్ర మంలో జలజీవన్ మిషన్, స్వచ్ఛ భారత్ మిషన్ కేంద్ర బృందం, నేషన ల్ వాష్ ఎక్స్ పర్ట్ అధికారి అన్బలగన్ , ఆర్డబ్ల్యూఎస్ ఈఈ నరేంద్ర, ఎంపీడీవో రాజేంద్ర బాలాజీ, ది ఈ స్టాలిన్, ఏఈ లోకనాథం, సర్పంచ్ కే వెంకటేష్, పంచాయతీ కార్యదర్శి సదా శివయ్య, స్వచ్ఛ భారత్ మిషన్ జిల్లా కో ఆర్డినేటర్ బాలసుందరం, బైరెడ్డిపల్లె, పెద్ద పంజాని ఎంఆర్సియు లు సురేష్ బాబు, సుధాకర్ గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



మాజీ డిప్యూటీ సీఎం నారాయణ స్వామిని సన్మానిస్తున్న వైసిపి నాయకులు

మాజీ డిప్యూటీ సీఎంకు సన్మానం

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం : వైసిపి రాష్ట్ర అడ్వైజర్ కమిటీ సభ్యులుగా మాజీ డిప్యూటీ సీఎం కళత్తూరు నారాయణస్వామి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఎస్ఆర్ పురం మండల వైసిపి నాయకులు మాజీ డిప్యూటీ సీఎం కళత్తూరు నారాయణస్వామి స్వగృహంలో శుక్రవారం కలిసి ఆయనకు పుష్పగుచ్ఛం అందించి శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైసిపి జిల్లా క్రియాశీలక కార్యదర్శి కుప్పయ్య, కో ఆప్షన్ నెంబర్ యేసు రత్నం , మార్కెటింగ్ డైరెక్టర్ గోవిందయ్య, జనార్ధన్, హరి రెడ్డి, మాజీ సర్పంచ్ మణి శ్యామ్, యుగంధర్, శేషాద్రి, ఆపూరు ధరణి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టిడిపి అధికార ప్రతినిధి చినబాబు

కార్యకర్తలు సమిష్టిగా ఉండాలి: చినబాబు

ప్రజాశక్తి -విజయపురం: టిడిపి కార్యకర్తలందరూ సమిష్టిగా ఉండాలని చిత్తూరు పార్లమెంటు టీడీపీ అధికార ప్రతినిధి చినబాబు పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని పన్నూరు సబ్‌స్టేషన్, విజయపురం, మహారాజపురంలో టీడీపీ కార్యకర్తల సమావేశం నిర్వహించి బూత్ కమిటీలను ఎంపిక చేశారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను, అభివృద్ధి పనులను ప్రజల్లో చేరవేయాలన్నారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు పార్లమెంటు కార్యనిర్వాహక కార్యదర్శి బాలసుబ్రహ్మణ్యంరాజు, మండల టీడీపీ అధ్యక్షుడు రమేష్‌రాజు, తెలుగు మహిళా అధ్యక్షురాలు గుణ భూషణమ్మ, మండల ప్రధాన కార్యదర్శి బాబుయాదవ్, పలువురు టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

వక్ఫ్ చట్టాన్ని రద్దు చేయాలి

- ముస్లింల నిరసన
- ఉద్యమం ఉధృతం చేస్తామని వక్ఫ్ ప్రొటెక్షన్ కమిటీ హెచ్చరిక

ప్రజాశక్తి -పుంగనూరు: అన్యాయమైన వక్ఫ్ సవరణ చట్టాన్నిరద్దు చేయాలని లేకపోతే దేశవ్యాప్తంగా ఉద్యమిస్తామని పుంగనూరు వక్ఫ్ ప్రొటెక్షన్ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు, యూసుఫ్, ముజాయిద్ లు అన్నారు . స్థానిక ఇందిరా సర్కిల్లో శుక్రవారం నమాజ్ అనంతరం నిరసన ర్యాలీని నిర్వహించారు. సందర్భంగా వారు మాట్లాడుతూ వక్ఫ్ సవరణ చట్టంలో గణనీయమైన మార్పులు చోటుచేసుకున్నాయని ఈ మార్పులు గత చట్టం లో పొందుపరిచిన ప్రాథమిక సూత్రాలకు విఘాతం కలిగిస్తున్నాయి అన్నారు. ఈ సవరణ ద్వారా బిజెపి ప్రభుత్వం ప్రజలను చీల్చడానికి ఉద్దేశించిన తన హిందుత్వ ఏజెండాను ముందుకు తెస్తోందన్నారు. తన హిందుత్వ ఎజెండాను ముందుకు తెస్తుందని ముస్లింలు విచ్చలవిడిగా భూములను ఆక్రమించుకోవడానికి గత చట్టం ఉపయోగించుకున్నారు అంటూ పదే పదే చెబుతుందని ఆరోపించారు. వక్ఫ్ ఆస్తుల నిర్వహణ నుండి ముస్లిం మేతరులకు నిషేధించాలని ఇస్లామిక్ ఆదేశాలు ఉన్నప్పటికీ సవరించిన చట్టం ముస్లిమేతరులను వక్ఫ్ బోర్డులో



చేర్చిందన్నారు. ఇది మతాన్ని ఆచరించుకునేందుకు ముస్లింలకు వున్న రాజ్యాంగ హక్కు పై దాడి చేయడమేనన్నారు. ఈ సవరణ చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని లేకుంటే దేశవ్యాప్తంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలతో హోరెత్తించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు నూరల్ల, సహాయ కార్యదర్శి మమ్ము, ఇమ్రాన్, అయూబ్, రఫీ, అల్తాఫ్ పాల్గొన్నారు.

ప్రత్యేక సంచికల పంపిణీ

బంగారుపాళ్యం: వక్ఫ్ బోర్డ్ రద్దు పై 'ప్రజాశక్తి' రూపొందించిన ప్రత్యేక సంచికను శుక్రవారం మండలంలోని పలు ముస్లిం సోదరులకు మసీదుల్లో స్థానిక జర్నలిస్టు శంకరన్ పంపిణీ చేశారు. పలువురు ముస్లింలు దీన్ని చదివి వక్ఫ్ చట్టంపై అవగాహన కల్పిస్తూ రాసిన దినపత్రిక ప్రజాశక్తి అని ఈ పేపర్ లో ఉన్న కథనం మొత్తం ప్రతి ఒక్క ముస్లింలు చదవాలని మన హక్కులను కాలరాస్తున్న ప్రభుత్వంపై వ్యతిరేకత చూపాలని ముస్లిం పెద్దలు పిలుపునిచ్చారు.



వరసిద్ధి వినాయకుడిని దర్శించుకున్న ఎమ్మెల్యేలు

వరసిద్ధుని సేవలో ఎమ్మెల్యేలు

ప్రజాశక్తి- ఐరాల: కాణిపాకం స్వయంభూ శ్రీ వరసిద్ధి వినాయక స్వామిని పలువురు ఎమ్మెల్యేలు దర్శించుకున్నారు. శుక్రవారం మధ్యాహ్నం కాణిపాకం ఆలయం వద్దకు చేరుకున్న పూతలపట ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్ , ఒంగోలు ఎమ్మెల్యేదామరచర్ల జనార్ధన్‌కి ఆలయ ఏఈవో రవీంద్రబాబు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనంతరం ఆలయ వేద ఆశీర్వాద మండపంలో వీరికి వేద పండితులు వేద ఆశీర్వాదం అందించగా, ఆలయ ఏఈవో రవీంద్ర బాబు స్వామి వారి పట్టు వస్త్రంతో సత్కరించి స్వామి వారి చిత్రపటాన్ని, తీర్థ ప్రసాదాలను అందించారు. ఈ కార్యక్రమంలో తవణంపల్లె మండల టిడిపి అధ్యక్షులు గాలి దిలీప్ కుమార్, మాజీ ఛైర్మన్ మణి నాయుడు, టిడిపి నాయకులు ప్రవీణ్ పాల్గొన్నారు.

ముగిసిన ఆలయ కుంభాభిషేకం



ప్రజాశక్తి -విజయపురం: మండలంలోని పన్నూరు లో ఆనంద వల్లీదేవి సమేత ఇష్టకామేశ్వర స్వామి ఆలయంలో మూడు రోజుల పాటు నిర్వహించిన జీర్ణోద్ధరణ, మహా కుంభాభిషేకం శుక్రవారం ముగిసింది. ఆల యంలో ఉదయం న్యాస హోమం, వేదపారాయణం, మహాపూర్ణాహుతి, అఖండ దీపారాధన, యంత్రదానం, కలశప్రదక్షిణ, మహా కుంభాభిషేకం నిర్వహించారు. మధ్యాహ్నం సుమారు 500 మందికి అన్నదానం నిర్వహించారు. సాయంత్రం శ్రీవారి కల్యాణోత్సవం నిర్వహించి, రాత్రి పుర వీధుల్లో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త మదన గోపాలరాజు, మాజీ ధర్మకర్త విష్ణువర్ధనరాజు, ఆలయ కార్య నిర్వాహకులు రఘునాథ రెడ్డి, పురోహితులు బాలసుబ్రహ్మణ్యశర్మ, అన్నదాన నిర్వాహకులు కుమార స్వామి రాజు, శ్యాంసుందర్, గ్రామస్తులు భక్తవత్సలంరెడ్డి, ముకుందరెడ్డి, గజేంద్రనాయుడు పలువురు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టిడిపి నాయకులు

టిడిపి సంస్థాగత ఎన్నికలు

ప్రజాశక్తి- కుప్పం రూరల్ : టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబు పిలుపు మేరకు కుప్పం పట్టణం, మండల పరిధిలో పార్టీ సంస్థాగత ఎన్నికలను శుక్రవారం నిర్వహించారు. ఇందులో భాగంగా పలు గ్రామాలతో పాటు కంగుంది పంచాయతీ, కుప్పం పట్టణం కొత్తపేట 13, 14 వార్డులకు సంబంధించి పార్టీ అధ్యక్షులను ఎన్నుకున్నారు. ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ ఆధ్వర్యంలో పట్టణంలోని 13, 14 వార్డుల అధ్యక్షులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు వారు తెలిపారు. 13వ వార్డుకు లోకేష్ ను, 14వ వార్డుకు మురళిని అధ్యక్షులుగా ఎన్నుకున్నారు. పట్టణంతో పాటు పలు గ్రామ పంచాయతీలకు అధ్యక్షులుగా ఎన్నికైన అభ్యర్థులు మాట్లాడుతూ పార్టీ అధిష్టానం సూచనలను ఆచరిస్తూ, స్థానికంగా పార్టీ బలోపేతానికి పనిచేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాలకు చెందిన టిడిపి నాయకులు, కార్యకర్తలతో పాటు నియోజకవర్గ టిడిపి విస్తరణ విభాగ కమిటీ సభ్యులు కన్నన్, పట్టణ టిడిపి అధ్యక్షులు రాజ్ కుమార్, ప్రధాన కార్యదర్శి ఆర్ముగం, నాయకులు కాణిపాకం వెంకటేష్, అన్సర్ బాష, సత్యేంద్ర శేఖర్, కిరణ్ కుమార్ పాల్గొన్నారు.



ఉద్యోగ విరమణ పొందిన ప్రధానోపాధ్యాయుని దంపతులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

గురువులు మార్గదర్శకులు

ప్రధానోపాధ్యాయుల ఉద్యోగ విరమణ సన్మాన సభలో జెడ్ మాజీ ఛైర్మన్ కుమార్ రాజా

ప్రజాశక్తి - బంగారుపాళ్యం: గురువులు సమాజ మార్గదర్శ కులని జెడ్పీ మాజీ ఛైర్మన్ కుమార్ రాజా, ఎంపీపీ అమరావతి అన్నారు. మండలంలోని తుంబ కుప్పం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు పార్థసారధి ఉద్యోగ విరమణ శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భం గా వారు మాట్లాడుతూ ఏ రంగంలో అయినా అభివృద్ధి చెందాలంటే విద్య నేర్పిన గురువులే మార్గదర్శకాలని గురువుల ద్వారానే మార్గదర్శం నిర్ధారణ అవుతుందని గురువు లేనిదే సమాజం లేదన్నారు. అనంతరం ఆయనను పలువురు దుశ్శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ సింగల్ విండో అధ్యక్షులు దత్తు రెడ్డి విశ్రాంత ఎంఈఓ వాసుదేవ నాయుడు , గ్రామస్తులు మునిరత్నం, పరదేశి, పలువురు ఉపాధ్యాయిని ఉపాధ్యా యులు, వారి స్నేహితులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



మాజీ డిప్యూటీ సిఎం నారాయణస్వామిని ఆహ్వానిస్తున్న ఏపీడబ్ల్యూజేఎఫ్ నాయకులు

22న జిల్లా మహాసభలకు రండి..

మాజీ డిప్యూటీ సీఎంకు ఏపీడబ్ల్యూజేఎఫ్ నాయకుల ఆహ్వానం

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం : చిత్తూరు పట్టణంలో ఈ నెల 22 వ తేదీ నిర్వహించనున్న ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (ఏపీడబ్ల్యూజేఎఫ్) చిత్తూరు జిల్లా 4 వ మహాసభలకు రావాలని రాష్ట్ర మాజీ డిప్యూటీ సీఎం కళత్తూరు నారాయణస్వామి, స్టేట్ డైరెక్టర్ ఏపీ మాల వెల్ఫేర్ కో ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ పొన్న యుగంధర్ లను ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా కమిటీ, ఏపీడబ్ల్యూజేఎఫ్ గంగాధర నెల్లూరు నియోజక వర్గ కమిటీ ప్రతినిధులు శుక్రవారం ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఏపీడబ్ల్యూజే ఎఫ్ రాష్ట్ర కమిటీ నాయకులు కరకుంట్ల జయరాజ్, చిత్తూరు జిల్లా ఉపాధ్యక్షులు ఎట్టేరి దేవరాజులు, ఆంధ్రప్రదేశ్ బ్రాడ్ కాస్ట్ జర్నలిస్ట్ అసోసియేషన్ (ఏపీ బిజెఏ) జిల్లా ప్రధాన కార్యదర్శి నీరజాక్షులు అలియాస్ చిన్న, ఉపాధ్యక్షులు విజయ్, జిల్లా గంగాధర నెల్లూరు నియోజక వర్గ కమిటీ అధ్యక్షులు మోహన్ దాస్, ప్రధాన కార్యదర్శి దేవరాజులు, గౌరవ సలహాదారులు ప్రేమ్ చంద్, సాక్షి టీవీ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.



పాఠశాల ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

పలు ప్రారంభోత్సవాల్లో ఎమ్మెల్యే

ప్రజాశక్తి -గంగవరం: గంగవరం మండలంలో శుక్రవారం పలు ప్రారంభోత్సవ కార్యక్రమాలలోఎమ్మెల్యే అమర నాథరెడ్డి పాల్గొన్నారు . ఇందులో భాగంగా బెంగళూరు -చెన్నై రహదారి వైఎస్ఆర్ విగ్రహం వద్ద నూతనంగా నిర్మించిన సరస్వతి కేఫ్ హోటల్ ప్రారంభించారు. అనంతరం కీలపట్ల క్రాస్‌లో నేషనల్ పబ్లిక్ స్కూలును ప్రారంభించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం పోటీ ప్రపంచంలో అనేక కళాశాలలు కాన్వెంట్‌లు ఉన్నాయని ఎన్ని ఉన్నా నాణ్యమైన విద్య క్రమశిక్షణతో విద్యార్థులను తీర్చి దిద్దితే తప్పక సక్సెస్ కావచ్చన్నారు. అందు కోసం యాజమాన్యంతో పాటు ఉపాధ్యాయులు క్రమ శిక్షణతో వుంటూ విద్యార్థులను తమ సొంత పిల్లల్లా భావించి చదువు చెప్పాలని సూచించారు. అనంతరం చౌడిరెడ్డి పల్లి పంచాయతీలోని బత్తనపల్లెలో నిర్వహించిన శ్రీరామ ఆలయ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజలలో ఆయన పాల్గొన్నారు. గ్రామస్తుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో గంగవరం మండల టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఆల యానికి విచ్చేసిన ఎమ్మెల్యేతో పాటు నాయకులకు, గ్రామస్తులు ఘన స్వాగతం తెలిపి పూజల అనంతరం తీర్థ ప్రసాదాలు అందించి ఆలయ మర్యాదలతో సత్కరించారు.

ఎపి పీజీసెట్‌కు దరఖాస్తులు ఆహ్వానం : వీసీ

ప్రజాశక్తి - క్యాంపస్ రాష్ట్రవ్యాప్తంగా స్విమ్స్, జేఎన్టీయూ వర్సిటీలలోని వివిధ పీజీ సైన్స్ కోర్సులతోపాటు, దాదాపుగా 17 విశ్వ విద్యాలయాలలో 2025-26 అకడమిక్ సంవత్సరానికి చేరే ఆసక్తి ఉన్న అభ్యర్థుల కోసం దరఖాస్తులు చేసుకోవాలని ఏపీ పీజీ సెట్ ఛైర్మన్, ఎస్వీయూ ఇంచార్జీ విసి ఆచార్య సిహెచ్ అప్పారావు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న డిగ్రీ పూర్తి చేసిన, డిగ్రీ ఫైనలియర్, చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు వివిధ కోర్సులలో చేరేందుకు అర్హులన్నారు. దరఖాస్తులను విద్యార్థులు, అభ్యర్థులు ఎలాంటి అపరాధ రుసుం లేకుండా ఏప్రిల్ 2వ తేదీ నుంచి మే 5వ తేదీ వరకు ఓసీ విద్యార్థులు రూ.850, బిసి విద్యార్థులు రూ.750, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రూ.650 రూపాయల ఆన్లైన్ ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఏపీ పీజీ సెట్ కన్వీనర్ ఆచార్య పీసీ వెంకటేశ్వర్లు, కో కన్వీనర్ ఆచార్య సురేంద్రబాబు కొంగర మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించే పీజీ సెట్ ప్రవేశ పరీక్షలో విద్యార్థులు ఆరో సెమిస్టర్ పూర్తి అవగానే వివిధ పీజీ కోర్సుల్లో చేరేందుకు అర్హులన్నారు. దీనికి సంబంధించిన కోర్సులకు సంబంధించి ఎలిజిబిలిటీ క్రైటీరియా వివరాలను సమాచారం పూర్తిగా వెబ్సైట్లో అందుబాటులో ఉందని వెల్లడించారు.

క్రైం న్యూస్



పాఠశాల ప్రహరీని ఢీకొని బోల్తా పడిన లారీ

లారీ బోల్తా

తప్పిన పెను ప్రమాదం

ప్రజాశక్తి -వి కోట : పాఠశాల ప్రహరీ గోడను ఢీకొని లారీ బోల్తా పడిన ప్రమాదంలో ఇద్దరు స్వల్ప గాయా లతో బయట పడడంతో తృటిలో పెను ప్రమాదం తప్పిన సంఘటన మండలంలో శుక్రవారం చోటు చేసుకుంది. పలమనేరు వైపు అగ్గిపెట్టెల రోడ్డుతో వెళ్తున్న లారీ మండలంలోని కొమ్మరమడుగు మలుపు వద్ద అదుపుతప్పి ప్రాథమిక పాఠశాల ప్రహరీ గోడను ఢీకొని బోల్తా పడింది. ఈ ప్రమాదంలో రాజస్థాన్‌కు చెందిన లారీ డ్రైవర్, క్లీనర్ స్వల్పగాయలతో బయట పడ్డారు. గాయపడ్డ వారిని 108 సాయంతో చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పాఠశాల ప్రారంభానికి ముందే ఈ ప్రమాదం చోటుచేసుకోవడంతో విద్యార్థులు ఎవరూ పాఠశాల ప్రాంగణంలో లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



ఆగి వున్న లారీని ఢీకొన్న కంటైనర్ లారీ

ఆగి ఉన్న లారీని ఢీకొన్న లారీ

తృటిలో తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం : ఆగివున్న లారీని మరో లారీ (కంటైనర్) ఢీకొన్న ప్రమాదంలో కంటైనర్ ముందు భాగం నుజ్జునుజ్జు అయ్యింది. ఎవరికీ ఎలాంటి ప్రమాదం లేకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్న సంఘటన గురువారం అర్ధరాత్రి మండలంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. మండలంలోని పయూరు గ్రామ పంచాయతీ పెద్దతయ్యూరు గ్రామం వద్ద ఆగి ఉన్న లారీని పల్లిపట్టు నుంచి చిత్తూరు వైపు వస్తున్న లారీ (కంటైనర్) గురువారం అర్ధరాత్రి ఢీకొంది. ఈ ప్రమాదంలో కంటైనర్ ముందు భాగం నుజ్జునుజ్జు అయ్యింది. అయితే తృటిలో ప్రమాదం తప్పింది. ప్రమాదవశాత్తు ఎవరికి ఎలాంటి గాయాలు లేక క్షేమంగా బయటపడటంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



నిందితుడిని శిక్షించాలని నిరసన వ్యక్తం చేస్తున్న మృతుడి బంధువులు

దాడిలో వ్యక్తి మృతి

నిందితుడిని శిక్షించాలని మృతుడి బంధువుల నిరసన

ప్రజాశక్తి,-కుప్పం టౌన్ : కుప్పం పట్టణం గుడుపల్లి రోడ్డు ప్రైవేటు కళాశాల సమీపంలో శుక్రవారం చోటుచేసుకున్న ఘర్షణలో వ్యక్తి మృతి చెందిన సంఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. ఉన్నాయి. గుడుపల్లి రోడ్డులో భారీ వాహనాల మెకానిక్ షెడ్ నడుపుకుంటున్న మహబూబ్ బాషా తన షెడ్డుకు ద్విచక్ర వాహనంపై వెళ తుండగా అటువైపు కారులో వెళ తున్న వ్యక్తి తనకు అడ్డుగా వచ్చాడని దాడికి పాల్పడ్డాడని



దాడిలో గాయపడి మృతి చెందిన మహబూబ్‌బాషా (ఫైల్‌ఫొటో)

తెలిపారు. ఈ దాడిలో ద్విచక్ర వాహనంపై వస్తున్న వ్యక్తి స్పృహ కోల్పోయాడని, స్థానికులు వెంటనే హుటాహుటిన బాధితున్ని పిఈఎస్ ఆసుపత్రికి తరలించారని తెలిపారు. బాధితుడిని పరిశీలించిన వైద్యులు అతను మరణించాడని ధ్రువీకరించారని తెలిపారు. బాధితుడి మరణ వార్త తెలుసుకున్న అతని బంధు వర్గం, కుటుంబ సభ్యులు పెద్ద ఎత్తున ఆసుపత్రి వద్దకు చేరుకుని, దాడికి పాల్పడ్డ వ్యక్తిని కఠినంగా శిక్షించాలంటూ నిరసన వ్యక్తం చేశారు. సమాచారం అందుకున్న ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ సురేష్ బాబు, కడా పీడీ వికాస్ మరమ్మాత్, డిఎస్పి పార్థసారధి ఆసుపత్రి వద్దకు చేరుకుని, వైద్యులను సంప్రదించి, బాధితుడి మరణానికి సంబంధించిన వివరాలు సేకరించి, రోదిస్తున్న బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ వ్యక్తి మరణానికి కారకులైన వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని, బాధిత కుటుంబ సభ్యులకు ప్రభుత్వం తరఫున అండగా నిలబడి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. మెకానిక్ మహబూబ్ బాషా మృతిపై స్పందించిన యూనియన్ సభ్యులు పట్టణంలో ర్యాలీగా బయలుదేరి, మహబూబ్ బాషా మరణం పై ఆవేదన వ్యక్తం చేస్తూ,ఆయన మరణానికి కారకులైన వారిపై చట్టరీత్యా తగు చర్యలు తీసుకుని, వారి కుటుంబ సభ్యులకు న్యాయం చేయాలని స్థానిక పోలీసులకు యూనియన్ తరఫున ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు విచారణ ప్రారంభించారు. పూర్తి వివరాలు పోలీసుల దర్యాప్తులో తెలియాల్సి వుంది.

IN THE COURT OF THE III ADDL. DISTRICT JUDGE; TIRUPATI
I.A.No. 283/2024, MVOP.No. /2024
G.Padmavathi & 2 other ...Petitioners
V/s
B.Suresh & 2 other ...Respondents
NOTICE TO RESPONDENT No.2
Bathula Prakash S/o B.Sivaiah,
D.No.1-3, Allamvari Kandriga village,
Nallavenganapalli post, Vedurukuppam mandal, Chittoor District, A.P.,
PIN code: 516 569
Please take notice that the above o.p. filed by the petitioner for compensation and the above o.p. is posted to 9-5-2025 for your appearance either in person or through your counsel at about 10.30 a.m. in the above court. Failing which matter will be decided ex parte.
(Order of the Court)
Date of hearing: 9-5-2025
KAVERIGARI NARAYANA
ADVOCATE, TIRUPATI
Cell: 80081 71739

ఘనంగా బోనాలు సమర్పణ

ప్రజాశక్తి -సోమల: మండల కేంద్రమైన సోమల లోని తొగట వీర క్షత్రియ కులానికి చెందిన వారు శుక్రవారం ఉనికిపెంట సమీపంలోని మామిడి తోట వద్ద చౌడేశ్వరి అమ్మవారిని కొలువు తీర్చి ప్రత్యేక పూజలు చేసి బోనాలు సమర్పించారు. ఉదయం 11 గంటలకు గ్రామంలోని తొగట కులస్తులు బ్రాహ్మణ కులస్తులు కలసి మామిడి తోట వద్దకు చేరి అమ్మవారిని ప్రతిష్ఠించి అమ్మవారి ఎదుట రంగురంగుల ముగ్గులను వేసి అనంతరం పూజలు నిర్వహించారు. అనంతరం అక్కడే వనభోజనాలను నిర్వహించారు.

